క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అంబాజీపేటలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. గంగలకుర్రుకు చెందిన గుత్తుల మహిబాలసూర్య వేడి నూనెలో పడి తీవ్రగాయాలు పాలవడంతో అతడి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.5 లక్షల చెక్కును వారి తల్లిదండ్రులకు అందజేశారు. అలాగే మాచవరానికి చెందిన రాజులపూడి షాన్విత, ఇరుసుమండకు చెందిన అప్పన వి.ఆంజనేయులకు చెరో రూ.2 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, చింతపల్లి వెంకటేశ్వరరావు, కొర్లపాటి కోటబాబు, బుడితి సత్యనారాయణమ్మ, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

'పెద్దింటి'కి ఎమ్మెల్యే అభినందనలు

కొత్తపేట: యూఎస్ఏకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్, భారత కళారత్న అవార్డు అందుకున్న స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం)ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అభినందించారు. మీరు చేసే ప్రయోగాలు, వివిధ వినూత్న సేకరణలు, సమాజ సేవా కార్యక్రమాలు పత్రికల్లో చూస్తున్నానని అన్నారు. మీ సేవా దృక్పథం అభినందనీయమన్నారు. అనంతరం శాలువాతో సత్కరించారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.వీరభద్రరావు రామంను అభినందించారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

పి.గన్నవరం: స్థానిక గరుడేశ్వరాలయం వద్ద బాల గణపతి నవరాత్ర మహోత్సవాల కోసం శనివారం పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు. స్థానిక నాయకులు గణేశుల చినకొండలరావు, గణపతి తాతాజీ, కత్రి బాబూరావు, ముత్యాల దుర్గారావు, సుంకర శ్రీనివాసరావు, అడ్డగళ్ల పుల్లారావు, పెరుమాళ్ల పెద్దిరాజు, అన్నాబత్తుల కళ్యాణ్, ఆదిమూలం రఘు, యర్రంశెట్టి బాబీ పాల్గొన్నారు.

ఇంట్లో నిద్రిస్తుండగానే చోరీ

రాజోలు: ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ చేయడం పరిపాటి. దీనికి విరుద్ధంగా రాజోలులో ఎంపీ ఆస్పత్రి వీధిలో ఇంట్లో కుటుంబీకులు నిద్రిస్తుండగానే దొంగలు బీరువాను కొల్లగొట్టి ఆరు కాసుల బంగారు వస్తువులు, కొంత నగదును శుక్రవారం రాత్రి దోచుకుపోయారు. ఈ మేరకు రాజోలుకు చెందిన జంపన శ్రీనివాసవర్మ రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై పృథ్వీలు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. అమలాపురం నుంచి క్లూస్ టీం వచ్చి చోరీ జరిగిన గది, బీరువాలో వేలిముద్రలు సేకరించారు. క్రికెట్ మ్యాచ్ చూసి నిద్రపోయామని రాత్రి ఒంటి గంట సమయంలో ఏదో శబ్దం వినబడి తలుపులు తీసేసరికి దొంగ పారిపోయాడని వర్మ వివరించారు. వంట గది కిటికీ తలుపు తెరిచి ఉండడంతో ఒక పొడవాటి వెదురు కర్రతో వంట గది తలుపు తెరిచి లోపలకు వచ్చాడని తెలిపారు. బీరువా సమీపంలో భద్రపరిచిన తాళం వెతికి తీసుకుని బీరువా తెరిచి బంగారు వస్తువులు, నగదు చోరీ చేశారన్నారు. బీరువాలోని వస్తువులను మంచంపై చెల్లాచెదురుగా పడవేసినట్టు పోలీసులు గుర్తించారు. చోరీకి సంబంధించి యజమాని వర్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పృథ్వీ తెలిపారు.

అన్ని ధర్మాలకు సనాతన ధర్మమే మూలం

కొత్తపేట: సనాతన ధర్మం ఉన్నచోట అన్ని ధర్మాలు వర్ధిల్లుతాయని టీటీడీ మాజీ పరీక్ష అధికారి, బ్రహ్మశ్రీ శ్రీపాద మాణిక్య అవధానులు అన్నారు. శ్రీవీరభద్ర-వేదశాస్త్ర విద్వత్సభ 56వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో వేద సభ నిర్వహించారు. స్థానిక విద్వత్సభ కమిటీ పర్యవేక్షణలో రాజమహేంద్రవరం సంస్కృత కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చిర్రావూరి శ్రీరామశాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వేదపండితులు మాణిక్య అవధానుల ఆధ్వర్యంలో సుమారు 70 మంది ఘనాపాఠీలు పాల్గొని వేదపఠనం జరిపారు. సనాతన ధర్మానికి మూలమైన వేద ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, వేదం చెప్పినట్లు నడుచుకోవాలని, ముఖ్యంగా పిల్లలను సనాతన ధర్మం వైపు నడిపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కీర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కాకరపర్తి బంగారుబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఆ అక్షరం.. చైతన్య సుమం

- సామాజిక దృక్కోణంలో కత్తిమండ ప్రతాప్ రచనలు
- జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు బోయి భీమన్న పురస్కారం అందించనున్న రాష్ట్ర ప్రభుత్వం

సఖినేటిపల్లి: ఆయన అక్షరాలు సామాజిక నవచైతన్య సుమాలై విరబూస్తాయి.. బడుగు జీవుల వెతలను అక్షరీకరిస్తాయి.. ఆలోచింపజేస్తాయి.. ఆయనే సామాజిక దృక్కోణంలో రచనలు సాగిస్తూ.. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్‌గా కూడా సేవలందిస్తున్న ఆయన సాహితీ కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. అత్యంత ప్రతిష్టాత్మకమైన మహాకవి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం అందించనుంది. విజయవాడలో ఆదివారం జరిగే ఈ కార్యక్రమంలో ఆయనకు పురస్కారంతో పాటు రూ.2 లక్షల నగదు బహుమతి అందించనుంది. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన సర్వీసుల శాఖల మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డాక్టర్ భీమన్న సతీమణి హైమవతి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు చేతుల మీదుగా ప్రతాప్ ఈ పురస్కారం అందుకోనున్నారు.

వ్యక్తిగతం

సఖినేటిపల్లి మండలం ఉయ్యూరువారి మెరక గ్రామానికి చెందిన కన్నమ్మ, ప్రభాకరరావు దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో చివరి వారు ప్రతాప్. 1977 ఆగస్టు 30న జన్మించారు. నర్సాపురం వైఎన్ కాలేజీలో ఎంఏ తెలుగు లిటరేచర్ చదువుకున్నారు. ఆయనకు భార్య ఉషాజ్యోతి, కుమారుడు మహీత్, ప్రణయ్ ఉన్నారు. ప్రతాప్ తొలినాళ్లలో వివిధ దిన పత్రికలకు విలేకరిగా, వారపత్రికలో కాలమిస్టుగా పని చేసేవారు. అలాగే, వివిధ ప్రైవేటు కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా కూడా పని చేశారు. క్రమంగా ఆయన దృష్టి సాహిత్యం వైపు మళ్లింది. అదే ఊపిరిగా ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు.



ప్రతాప్ సంపాదకత్వంలో 'భీమన్న జీవితం - సాహిత్యం'పై వెలువడిన సంపుటి

నిరంతర సాహితీ కృషీవలుడు

- ప్రతాప్ నిరంతర సాహితీ కృషీవలుడు. సామాజిక ఇతివృత్తంతో రచనలు చేయడం ఆయన సొంతం. ఇప్పటి వరకూ 10 కవిత్వ సంపుటాలు వెలువరించారు. రెండు నవలలు ముద్రించారు. రెండు కథల పుస్తకాలు వెలువరించారు.
- 2016లో అంతర్వేది పుణ్యక్షేత్రంలో 1,500 మంది కవులతో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు ప్రపంచ తెలుగు కవితోత్సవం నిర్వహించి జాతీయ, అంతర్జాతీయ రికార్డులు నెలకొల్పారు.



హైదరాబాద్ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగిన యువజన కళా ఉత్సవ్‌లో బోయి భీమన్న సతీమణి హైమవతి నుంచి సత్కారం అందుకుంటున్న ప్రతాప్ (ఫైల్)

- అదే సంవత్సరం తొలిసారిగా మలికిపురంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల పాటు నాన్‌స్టాప్ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఆయన సాహితీ కార్యక్రమాల నిర్వహణ సుదీర్ఘంగా కొనసాగుతోంది.
- ట్రాన్స్‌జెండర్లపై 200 మంది కవులతో, పారిశుద్ధ్య కార్మికులపై 150 మంది కవులతో ప్రత్యేక కవితా సంకలనం రూపొందించారు.
- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత నిర్మాణ సారథ్యంలో దిశ పాట, జగనన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పాట రచించి, పలువురి ప్రశంసలు పొందారు.

'భీమన్న జీవితం – సాహిత్యం'పై పుస్తకం

- శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన ప్రతాప్ సంపాదకత్వంలో భీమన్న సాహిత్యంపై ఈ ఏడాది ఆగస్టులో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ప్రత్యేక వెబినార్ నిర్వహించారు. ఇందులో సుమారు 100 మంది కవులు, సాహితీవేత్తలు, పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్ల పరిశోధక పత్రాలన్నింటితో కలిపి 'మహాకవి భీమన్న జీవితం – సాహిత్యం' పుస్తకాన్ని ప్రతాప్ తీసుకువచ్చారు.
- గతంలో ఆయన రాసిన పాలేరు నాటకాన్ని స్వీయ దర్శకత్వంలో 2017లో భీమన్న సతీమణి హైమవతి సమక్షంలో మలికిపురంలో ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు.
- బోయి భీమన్న సాహిత్య నిధి ట్రస్టు, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యాన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 2022లో ప్రతాప్ సారథ్యంలో జాతీయ శతాధిక మహిళా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ క్రమంలో 200 మంది కవయిత్రులతో ప్రతాప్ సంపాదకత్వంలో 'ఆమె' పేరిట కవితా సంకలనం ప్రచురించారు.

జాతీయ స్థాయిలో 124 కవి సమ్మేళనాలు

- ఐఎస్ఓ ప్రమాణాలు సాధించిన శ్రీశ్రీ కళావేదిక ద్వారా ఇంత వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 124 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించిన ఘనత ఆయనదే.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పేరిట నిరవధికంగా 48 గంటల పాటు భారీ సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. సాహిత్య చరిత్రలో ఇన్ని గంటల పాటు సుమారు 3 వేల మంది కవులతో నిర్వహించిన కార్యక్రమం ఇదేనని ప్రతాప్ చెప్పారు.

- వీటితో పాటు శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయవాడ, ఒంగోలు, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మంచిర్యాల, కోనసీమ జిల్లాల్లో జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించి ఎంతో మంది కవులను సత్కరించిన ఘనత ఆయనకే దక్కుతుంది.
- ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువజన కళా ఉత్సవ్‌లో భీమన్న సతీమణి హైమవతి చేతుల మీదుగా ప్రతాప్ సత్కారం అందుకున్నారు.

పూర్వజన్మ సుకృతం

సామాజిక అసమానతలపై సాహిత్యపరంగా దండెత్తిన మహాకవి బోయి భీమన్న పేరిట తొలి పురస్కారాన్ని ప్రభుత్వం నుంచి అందుకోవడం నా పూర్వజన్మ సుకృతం. మున్ముందు మరిన్ని సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు ఈ పురస్కారం ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది.

– డాక్టర్ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, ఉయ్యూరువారి మెరక

పింఛన్ల మంజూరులో అర్హతకే ప్రాధాన్యం

మామిడికుదురు: పింఛన్ల మంజూరుకు అర్హత ఒక్కటే ప్రామాణికమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం క్యాంపు కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన పింఛన్లను శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా ఎవరి రికమండేషన్ అవసరం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకం ఏది పొందాలన్నా వలంటీర్ నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి దరఖాస్తు చేస్తారని చెప్పారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా పింఛన్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

నగరం ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, పి.గన్నవరం మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి వికాస్‌బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనారోగ్యం నుంచి కోలుకున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ జి.మాధవి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ బొంతు నీలిమ, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, బత్తుల గంగారత్నం, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మార్కెట్‌యార్డు స్థాయిని మరింత పెంచేందుకు కృషి

కొత్తపేట/రావులపాలెం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని రావులపాలెం అరటి మార్కెట్ యార్డు స్థాయిని మరింత పెంచి, రైతులకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి అన్నారు. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రవీదేవి రావులపాలెం మార్కెట్ యార్డులో చైర్మన్ చాంబర్‌లో ప్రవేశించి పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.యశ్వంతరావు ఆధ్వర్యంలో సిబ్బంది వేదపండితులతో ఎదురేగి వేదమంత్రోచ్చారణతో ఘనస్వాగతం పలికి చైర్మన్ చాంబర్‌కు తోడ్కొని వెళ్లారు. రవీదేవి-చంటి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం యార్డులో రైతులను ముఖాముఖి కలసి మాట్లాడారు. కార్యదర్శి, సిబ్బందితో మార్కెట్ కమిటీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై సమీక్షించారు. యార్డు ద్వారా అరటి కొనుగోలు, అమ్మకాలు పరిశీలించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తమకు ఈ మార్కెట్ కమిటీ గురించి అవగాహన ఉందన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన సూచనలు, సలహాలతో ఏఎంసీని, అరటి మార్కెట్‌యార్డును మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఏఎంసీ ఆదాయాన్ని పెంచడంలో భాగంగా దీని పరిధిలోని ఐదు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు పటిష్టం చేసి, మార్కెట్ రుసుమును ఏవిధమైన లీకేజీలు లేకుండా వసూలు చేసి ఏఎంసీ ఆదాయాన్ని పెంచాలన్నారు. రైతులకు అండగా ఉందామని, వారికి, వ్యాపారులకు వివిధ సౌకర్యాలు కల్పించడంలో లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కొత్తపేట యార్డు ద్వారా కూడా కొబ్బరి తదితర వ్యవసాయ ఉత్పత్తుల రైతులకు ప్రయోజనాలు చేకూర్చేందుకు ఆలోచన చేయాల్సిందన్నారు. తద్వారా యార్డును అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.



రావులపాలెం మార్కెట్ యార్డులో చైర్మన్ రవీదేవి-చంటి దంపతులను సత్కరిస్తున్న ఏఎంసీ అధికారులు, సిబ్బంది

మహా జాబ్‌మేళాకు 65 మంది విద్యార్థులు

కొత్తపేట: డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన మహా జాబ్‌మేళాకు స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 65 మంది విద్యార్థులు హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. చదువుకున్న ప్రతి విద్యార్థికి ఆ చదువుకు తగ్గ ఉద్యోగం కల్పించాలనే సీఎం జగన్ లక్ష్యాన్ని అనుసరించి కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశాల మేరకు తణుకు నోడల్ రిసోర్స్ సెంటర్స్ (ఎన్ఆర్‌సీ) పరిధిలోని 16 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎన్ఆర్‌సీ)లో మహా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు స్థానిక కళాశాల నుంచి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ఆధ్వర్యంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసలు, అధ్యాపకులు 65 మంది విద్యార్థులను తీసుకువెళ్లారు. దేశ వ్యాప్తంగా 25 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన విద్యార్థులకు త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు తెలిపినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



ఓజోన్ పొరను పరిరక్షించాలని కోరుతూ పోతవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తొండవరంలో ఓజోన్ పొరపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు, హెచ్‌ఎంలు

అంబాజీపేట: జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. తొండరం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పీవీ కేశవాచార్యుల అధ్యక్షతన ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణ అంశంపై వ్యాస రచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మలికిపురం: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక మలికిపురం మండలం ప్రెసిడెంట్ పీవీవీ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం విశ్వేశ్వరాయపురంలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడారు.

మామిడికుదురు: ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని పేర్కొన్నారు. ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొక్కలు బహుమతిగా అందించారు.

పి.గన్నవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు అన్నారు. ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరిగి సొంత గూటికే చేరిన నాయకులు

ఆలమూరు/రావులపాలెం: బలవంతంగా టీడీపీ కండువాలు కప్పిన ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన బీసీ నేతలు వెంటనే కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో శనివారం రావులపాలెం మండలం గోపాలపురంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వ్యక్తిగతమైన పని ఉందంటూ వైఎస్సార్ సీపీ నేతలైన మట్టా శ్రీను, నిచ్చెనకోళ్ళ రామకృష్ణ, మట్టా ఏసు, నిచ్చెనకోళ్ళ ఏసు, నిచ్చెనకోళ్ళ వెంకన్న, వీరి సూరిబాబు, నిచ్చెనకోళ్ళ పెద సత్యనారాయణ తదితరులను రావులపాలెం తీసుకువెళ్లారు. అక్కడ టీడీపీ నేతలు బలవంతంగా పార్టీ కండువాలు కప్పారు. దీనిని జీర్ణించుకోలేక షాక్ కు గురైన వారంతా వెంటనే తేరుకుని ఈ విషయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలియజేసి తిరిగి మళ్లీ సొంత గూటికి చేరుకున్నారు. ఆయన వారందరికీ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఎన్ని కుట్రలు పన్నినా మా పార్టీ నేతలు కుటుంబ సభ్యులు వంటి వారని వారు ఎల్లప్పుడూ మా వెంటే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.



ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన బీసీ నేతలు

రావులపాలెం: మండలంలోని ఈతకోట గ్రామ మాజీ సర్పంచ్ మాధవరపు రామ వెంకట సత్యసాయిబాబా శనివారం టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్ కుల, మత, పార్టీ, వర్గ భేదాలు చూడకుండా అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్టు ఆయన ప్రకటించారు. పార్టీలో చేరిన సాయిబాబాకు ఈతకోటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు.

సీతారామయ్య మృతి పార్టీకి లోటు

ఆత్రేయపురం: వైఎస్సార్ సీపీ పార్టీ సీనియర్ నాయకుడు దాసరి సీతారామయ్య మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకకి చెందిన దాసరి సీతారామయ్య శనివారం ఉదయం మృతి చెందడంతో ఎమ్మెల్యే మృతుడి స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీతారామయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సీతారామరాజు మృతికి పలు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం

మలికిపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అత్యంత నాణ్యమైన ఆరోగ్యకరమైన ఆహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి పేర్కొన్నారు. శనివారం మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గతం కంటే భిన్నంగా, మెరుగ్గా ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఉందన్నారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్‌గా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామి నాయుడు, సూపర్‌వైజర్ ప్రసన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్రేయపురం: మండలంలోని అన్ని గ్రామాలకు ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు.

జగనన్న సురక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

అంబాజీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం సచివాలయం-1 పరిధిలో నాగాబత్తులవారిపాలెంలో అంబాజీపేట వైద్యాధికారి వి.గౌతమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శనివారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిల్లో కాన్పుల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సంక్షేమానికి చిరునామా ఏపీ



తాటిపాకలో పథకాల లబ్ధి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



ఈతకోటలో లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రాజోలు: సీఎం జగన్ పాలనలో సంక్షేమానికి ఏపీ చిరునామాగా నిలిచిందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం తాటిపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ రోడ్డు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని ఎమ్మెల్యే లబ్ధిదారులకు వివరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మంచి గుర్తింపు లభించిందన్నారు. నాడు-నేడు పథకంతో పాఠశాల అభివృద్ధి చేయడంతో ఇదే తరహాలో కేంద్రం పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. వ్యవసాయం, వైద్యం, ఆర్థిక సహకారం అందించే పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు మన రాష్ట్రంలో అధ్యయనం చేస్తున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటిపల్లి ఏస్తేరు రాణి, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ సభ్యుడు కనపాల బాబూరావు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, మద్దుల కాసు, చెల్లింగి చినబాబు, బొంతు రమేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ.. సంక్షేమాన్ని వివరిస్తూ..

రావులపాలెం: ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా శనివారం మండలంలోని ఈతకోటలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి వారి ఇంట్లో సీఎం జగన్ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు ఉంటే చెప్పాలని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేశామన్నారు. ఏ ప్రభుత్వంలో చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని జగ్గిరెడ్డి అన్నారు. ఈతకోటలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకేని, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాన్ని, రూ.2 లక్షలతో నిర్మించిన మోటూరి సుబ్బలక్ష్మి ఇంటి వద్ద సీసీ రోడ్డును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, చింతారావు, వైవీ, సెక్రటరీ మూర్తి, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు దాతల ఆర్థిక సాయం

మామిడికుదురు: రెండు కిడ్నీలు పాడైపోయి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెదపట్నంలంక గెడ్డంవారిపేటకు చెందిన పల్లి ఏడుకొండలు కుటుంబానికి శనివారం పి.గన్నవరం మండలం ఊడిమూడికి చెందిన జనసేన నేత గిడ్డి సత్యనారాయణ రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఏడుకొండలు కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని మానవతా దృక్పథంతో సహాయం అందించామని సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, పార్టీ నేతలు కొమ్ముల మాధవరావు, ఉందుర్తి బాబులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఇరువురికి కె.పెదపూడి ఈతకోట సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఈతకోట నాగరాజు ఆధ్వర్యంలో శనివారం సాయం పంపిణీ చేశారు. తన తండ్రి సత్యనారాయణ మూడో వర్ధంతిని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగలకుర్రు అగ్రహారానికి చెందిన దర్శపాటి ప్రశాంత్‌కు రూ.10 వేలు, బోడసుకుర్రుకు చెందిన కొడమంచిలి ప్రశాంత్ కుమారుడు 15 నెలల బాలుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని అతని రూ.10 వేలు ఆర్థిక సాయం చేసినట్లు నాగరాజు తెలిపారు. అలాగే అమలాపురం మదర్‌థెరిసా ఓల్డేజ్ అర్ఫన్స్ హోమ్‌లో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉందుర్తి ఆనందబాబు, ఉందుర్తి సుబ్బారావు, ఈతకోట శ్రీను, ఆకుమర్తి దొరబాబు, పెదపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు..

అయినవిల్లి: మండలంలోని వెలవలపల్లిలో బూల వెంకటాచలం ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. ఈ విషయం తెలుసుకుని జనసేన నాయకులు జి.సత్యనారాయణ రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పోలిశెట్టి రాజేష్, మద్దా చంటిబాబు, మేడిశెట్టి భగవాన్, సవరపు వెంకటేష్, మేడిశెట్టి పండు తదితరులు ఉన్నారు.

ఏబీఎన్‌పై చర్య తీసుకోవాలంటూ వినతిపత్రం

మామిడికుదురు: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బెంగుళూరులో ఒక యువతి రజకులను అవమానించే విధంగా మాట్లాడిన మాటలను ప్రచారం చేసిన ఏబీఎన్‌తో పాటు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన యువతిపై కూడా చర్యలు తీసుకోవాలని మండల రజక సంఘం డిమాండ్ చేసింది. దీనిపై సంఘం పెద్దలు శనివారం నగరం పోలీస్ స్టేషన్‌లోను, మండల పరిషత్ కార్యాలయంలోను వినతి పత్రం ఇచ్చారు. రజకులను దుర్భాషలాడుతూ యువతి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఆమెపై చర్య తీసుకోవాలని రాష్ట్ర రజక చైతన్య సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి పసుపులేటి మహాలక్ష్మీరావు డిమాండ్ చేశారు. ఆమెతో పాటు ఈ దృశ్యాలను ప్రసారం చేసిన ఏబీఎన్‌పైనా చర్య తీసుకోవాలన్నారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మండల శాఖ అధ్యక్షుడు కోటిపల్లి సాయిబాబు, పి.ధర్మయ్య, కె.శ్రీనివాసరావు, పి.భాస్కరరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.త్రిమూర్తులు, ముత్యాలపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం ప్రతినిధులు